# విప్లవ రచయితల సంఘం

***పత్రికా ప్రకటన***

## టాటా ఇన్స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్ విద్యార్థుల పోరాటానికి విరసం సంఘీభావం

దేశంలోని యూనివర్సిటీలను, సామాజిక పరిశోధనను సంక్షోభంలోకి నెట్టే ప్రైవేటీకరణ, కాషాయీకరణ విధానాలను కేంద్ర ప్రభుత్వం అప్రతిహతంగా అమలుచేస్తోంది. విద్యార్థుల ఆందోళనతో కేంపస్ లు ప్రతిధ్వనిస్తున్నాయి. గాట్స్ ఒప్పందం ద్వారా విద్యను ప్రైవేటీకరించే పని పరిపూర్తి చేసి, విద్యావంతులను తమను పెంచి పోషించిన సమాజం నుండి దూరం చేసి అంతర్జాతీయ పెట్టుబడికి దాసులుగా తయారుచేసే ప్రక్రియను చివరికి తీసుకోచ్చేస్తోంది భారత ప్రభుత్వం. తనమీద కార్పోరేట్ యాజమాన్యాలు పెట్టిన బాధ్యతను నిర్వర్తించడానికి ప్రగతిశీల విద్యార్థి సంఘాలపై తమ గూండా సేనలతో యుద్ధం ప్రకటించింది బిజెపి. ఈ క్రమంలో మతాన్ని అడ్డం పెట్టుకొని ఎబివిపి, ఆరెస్సెస్ మూకలు విద్యార్థి సంఘాలతో ఘర్షణలకు దిగుతున్నాయి. అల్లర్లు యూనివర్సిటీలలో విద్యార్థి రాజకీయాలు లేకుండా చేయాలనే కుట్రను అమలు చేస్తున్నాయి. అయితే ప్రభుత్వ విధానాల వల్ల ఉన్నత విద్యకు దూరమయ్యే పరిస్థితిలో అట్టడుగు వర్గాల నుండి వచ్చిన విద్యార్థులు ఈ మౌలిక సమస్య మీద మరింత ధృడంగా పోరాడాల్సిన స్థితి వచ్చేసింది. అందుకు ఉదాహరణ టాటా ఇన్స్టిట్యూట్ అఫ్ సోషల్ సైన్సెస్ కు చెందిన నాలుగు కేంపస్ లలో విద్యార్థులు చేపట్టిన ఆందోళన. ఈ పోరాటానికి విరసం సంఘీభావం తెలియజేస్తున్నది.

21 ఫిబ్రవరి నుండి టాటా ఇన్స్టిట్యూట్ అఫ్ సోషల్ సైన్సెస్ (TISS) యూనివర్సిటీ ముంబై, తుల్జాపూర్, గువహటి, హైదరాబాద్ కేంపస్ లలో విద్యార్థులు చేస్తున్న ఆందోళన బండబారిపోయిన యూనివర్సిటీ అధికార్లను, ప్రభుత్వాన్ని ఏమాత్రం కదిలించడం లేదు. ఎస్సీ, ఎస్.టీ, ఓ.బి.సి స్కాలర్ షిప్పులు నిలిపివేయడానికి వ్యతిరేకంగా ఫిబ్రవరి 21న విద్యార్థులు యూనివర్సిటీ బంద్ చేసారు. ప్రభుత్వం నుండి అందవలసిన పోస్ట్ మెట్రిక్ స్కాలర్ షిప్పులు అర్ధాంతరంగా ఆపివేయడం, ప్రవేశ సమయంలో ఫీజులు మినహాయిస్తామని చెప్పిన TISS యాజమాన్యం ఇప్పుడు ఫీజులు చెల్లించమని నోటీసులిచ్చింది. చెల్లించే స్తోమత లేని విద్యార్థులు యూనివర్సిటీ క్యాంపస్ లు వదిలి వెళ్ళాల్సిన స్థితి. రీసెర్చ్ ఫెలో షిప్స్ తీసేయడం, సామాజిక శాస్త్రాల పరిశోధనలకు గ్రాంట్లు తొలగించడం మొదలుకొని ప్రతి బడ్జెట్ లోనూ విద్యకు కేటాయించే నిధులు తగ్గిస్తూ వస్తోంది కేంద్ర ప్రభుత్వం. పేద, దళిత విద్యార్థులను విద్యకు దూరం చేస్తూ అదే సమయంలో, మార్కెట్ కోసం, మార్కెట్ చేతిలో నడిచే చదువులు, పరిశోధనలు తీసుకొస్తోంది. దీన్ని వ్యతిరేకించాల్సిన అవసరం ఇవాళ దేశానికి అత్యవసరం. విద్య కార్పోరేటీకరణను తీవ్రంగా నిరసించాలని ప్రజాస్వామికవాదులకు విరసం, విజ్ఞప్తి చేస్తున్నది.

**- పాణి, కార్యదర్శి**

**విప్లవ రచయితల సంఘం**

తేదీ: 25-2-2018